## క్లుప్తంగా

### రేపటి నుంచి మండల స్థాయి క్రీడాపోటీలు

**చీమకుర్తి:** రాష్ట్రస్థాయి స్కూలు గేమ్స్ ఫెడరేషన్ క్రీడాపోటీల్లో భాగంగా మండల స్థాయి క్రీడా పోటీలు ఈనెల 9, 10 తేదీలలో నిర్వహిస్తున్నట్లు స్కూలు గేమ్స్ ఫెడరేషన్ మండల కోఆర్డినేటర్ డీ స్వరూపావాణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్ 14 విభాగంలో ఈనెల 9న బండ్లమూడి జిల్లా పరిషత్ హైస్కూలులో అథ్లెటిక్స్ పోటీలు, ఈనెల 10న చీమకుర్తి ప్రభుత్వ హైస్కూలులో గేమ్స్ పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులను ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, మేనేజ్‌మెంట్ కమిటీ వారు పాల్గొనేలా చూడాలని ఎంఈఓ ఆదేశించినట్లు కోఆర్డినేటర్ స్వరూపావాణి తెలిపారు.

### స్టాఫ్ నర్స్‌కు సన్మానం



స్టాఫ్ నర్స్ సుశీలను సన్మానిస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది

**మద్దిపాడు:** మండల కేంద్రం మద్దిపాడు పీహెచ్‌సీలో స్టాఫ్‌నర్స్‌గా పనిచేస్తూ ప్రమోషన్‌పై వెళుతున్న సుశీలను మద్దిపాడు పీహెచ్‌సీ సిబ్బంది ఘనంగా సన్మానించారు. సుశీల మద్దిపాడు పీహెచ్‌సీలో గత ఐదేళ్లుగా పని చేస్తూ గన్నవరానికి ప్రమోషన్‌పై బదిలీ అయ్యారు. ఈ క్రమంలో సీహెచ్‌ఓ లలితమ్మ మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సుశీల అందరితో మంచిగాఉంటూ చక్కగా పని చేశారని అభినందించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ బాలకోటయ్య, సీనియర్ అసిస్టెంట్ శాంతికుమారి, స్టాఫ్ నర్సులు అరుణ కుమారి, సృజి రాణి,దేవి, ఫార్మసిస్ట్ శాంతిప్రియ, హెచ్‌వీలు నాగరాజ కుమారి, సీతమ్మ, దరియా శ్రీనివాసరావు,పాపారావు బాజీ, ఎంఎల్‌హెచ్‌సీలు, ఏఎన్‌ఎంలు ఆశావర్కర్లు పాల్గొన్నారు.

### పకడ్బందీగా స్వామిత్వ సర్వే



స్వామిత్ర సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీవో

**సంతనూతలపాడు:** స్వామిత్వ సర్వేను మంగళవారం ఎంపీడీవో డీ సురేష్‌బాబు పరిశీలించారు. సంతనూతలపాడులో ఆరు టీములు స్వా మిత్రలో ఇళ్ల కొలతల ప్రక్రియను చేపట్టినట్టు ఎంపీడీవో పేర్కొన్నారు. ప్రభుత్వం పంపించిన మ్యాపుల ద్వారా పనులు ముమ్మరంగా జరుగుతున్నట్లు ఆయన తెలిపారు.కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో రవికుమార్, కార్యదర్శి ఎన్. ప్రతాప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### అమెరికా అండతోనే గాజాలో మారణకాండ



సమావేశంలో మాట్లాడుతున్న వామపక్ష నాయకులు

**ఒంగోలు టౌన్:** అమెరికా అండదండలతోనే ఇజ్రాయిల్ గాజాపై మారణకాండకు తెగబడిందని..గత రెండేళ్లుగా పసిపిల్లలు, మహిళలు, వృద్ధులను విచక్షణారహితంగా హతమారుస్తోందని వామపక్ష నాయకులు ధ్వజమెత్తారు. గాజాపై దాడులకు రెండేళ్లు పూర్తయిన సందర్భంగా మంగళవారం సుందరయ్య భవనంలో సీపీఎం, సీపీఐ, సీపీఐ (ఎంఎల్), సిపిఎం ఎల్ న్యూ డెమొక్రసీ పార్టీలు సంయుక్త సమావేశం నిర్వహించాయి. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. యుద్ధ నిబంధనలను గాలికొదిలికేసి అత్యంత క్రూరంగా ఆసుపత్రులు, పాఠశాలలు, నిర్వాసితులు శిబిరాలపై దాడులు చేసి బాంబుల వర్షం కురిపించడం దుర్మార్గానికి పరాకాష్టగా ఖండించారు. గాజా ప్రజలకు సంఘీభావంగా ఈనెల 21వ తేదీన అద్దంకి బస్టాండు నుంచి కలెక్టరేట్ వరకు శాంతి ప్రదర్శన నిర్వహించాలని సమావేశం తీర్మానం చేసింది. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి ఎస్‌కె మాబు, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ, సీపీఐ (ఎంఎల్) నాయకులు ఎంఎస్ సాయి, సీపీఎం ఎల్ న్యూ డెమొక్రసి నాయకులు ఆర్.మోహన్ పాల్గొన్నారు.

### నల్లబర్లీ పొగాకు సాగు నిషేధం

● తహసీల్దార్ రజనీకుమారి



పొగనారు మడులు పరిశీలిస్తున్న టాస్క్‌ఫోర్స్ కమిటీ

**కురిచేడు:** జీవో నంబర్ 740 ప్రకారం నల్ల బర్లీ పొగాకు సాగుపై నిషేధం ఉందని, రైతులెవరూ సాగు చేయవద్దని తహసీల్దార్ జి.రజినికుమారి తెలిపారు. మండలంలోని కురిచేడులో పొగాకు నర్సరీలను సోమవారం మండల టాస్క్‌ఫోర్స్ కమిటీ సభ్యులైన తహసీల్దార్, మండల వ్యవసాయ అధికారి, పోలీస్ కానిస్టేబుల్ సందర్శించారు. పొగనారు సాగు చేసిన రైతులతో మాట్లాడారు. మండల వ్యవసాయ అధికారి బి.సంపత్ కుమార్ మాట్లాడుతూ తెల్ల బర్లీ పొగాకు కంపెనీ వాళ్లతో అగ్రిమెంటు ఉంటే మాత్రమే రైతులు సాగు చేయాలని సూచించారు.



స్వామి అమ్మవార్ల కల్యాణంలో పాల్గొన్న భక్తులు



సామూహిక లక్ష్మీ హోమ క్రతువులో మహిళలు

# దేవదేవుని కల్యాణం.. చూసిన కనులదే భాగ్యం

ఒంగోలు మెట్రో:

నగరంలో వేంకటేశ్వర స్వామి కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఒంగోలు మంగమూరు రోడ్డు ఆశ్రమం ప్రగతి కాలనీలో ఇటీవల నూతనంగా నిర్మించిన వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో మండలాభిషేక పూజలు పూర్తైన సందర్భంగా వెంకటేశ్వరునికి కల్యాణ మహోత్సవం జరిపించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు దేవస్థాన ఆవరణలో చూడచక్కని కల్యాణ వేదికను ఏర్పాటు చేశారు. వేదికపై శ్రీదేవి, భూదేవి అమ్మవార్లను ఒక వైపు వేంకటేశ్వర స్వామి వారిని మరో వైపు కొలువు తీర్చి భక్తుల హర్షధ్వానాల నడుమ స్వామి వారి కల్యాణోత్సవం నేత్రోత్సవంగా సాగింది. ఈ సందర్భంగా రుత్విక బృందం ముందుగా దేవేరులను కంకణధారులను చేసి నూతన పట్టు వస్త్రాలను సమర్పించారు. అభిజిత్ శుభ ముహూర్తాన వేళ జీలకర్ర బెల్లం పెట్టిన కన్యాదినం, మాంగళ్యధారణ, తలంబ్రాల సమర్పణ, మాల మార్పిడిని శాస్త్రబద్ధంగా నిర్వహించారు. అనంతరం పుష్పార్చనను జరిపించి భక్తులకు ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో దేవస్థాన ధర్మకర్త లు వందలాది మంది భక్తులు పాల్గొన్నారు.



దేవేరులతో శ్రీవారు



అమ్మవారి పూజలో భవాని స్వాములు

**భక్తిశ్రద్ధలతో భవానీ పూజలు..**

మంగళవారం పౌర్ణమి పురస్కరించుకొని ఒంగోలు నెహ్రూ కాలనీలోని దుర్గా మల్లేశ్వరి దేవస్థానంలో దుర్గా మహిళా శక్తి ఆధ్వర్యంలో మహాలక్ష్మీ హోమాలు వైభవంగా నిర్వహించారు. ఉదయం పది గంటలకు దేవస్థానం ప్రాంగణంలో హోమ గుండాన్ని ఏర్పాటు చేసి సామూహికంగా మహిళలందరూ మహాలక్ష్మి హోమ క్రతువులను శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయంత్రం సామూహికంగా లలితా సహస్రనామ పారాయణంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో స్థానిక భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు అందుకున్నారు.

**మిలటరీ కాలనీ భవానీ పూజలు..**

దసరా శరన్నవరాత్రులు పురస్కరించుకొని ఒంగోలు మంగమూరు రోడ్డు మిలటరీ కాలనీ యానాది సంఘం కనకదుర్గమ్మ దేవస్థానంలో మంగళవారం సాయంత్రం అత్యంత భక్తిశ్రద్ధలతో భవాని స్వాములు అమ్మవారి మూలమూర్తికి అభిషేకం నిర్వహించి వివిధ రకాల పూలతో పుష్పాలంకరణగావించి అర్చన నిర్వహించారు. అనంతరం స్థానిక భవాని స్వాములు ఆధ్వర్యంలో అమ్మవారి భజన కార్యక్రమాలను నిర్వహించి తీర్థప్రసాదాలు అల్పాహారాన్ని స్వీకరించారు.

# సీజేఐ గవాయ్ మీద దాడి క్షమించరానిది

**ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరసనలు**

**చీమకుర్తి:** సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తిపై ఆర్ఎస్ఎస్‌కు చెందిన న్యాయవాది బూటును విసిరివేసినందుకు వ్యతిరేకంగా ప్రజాసంఘాల నాయకులు మంగళవారం చీమకుర్తిలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నల్లరిబ్బన్‌లతో నిరసనలు వ్యక్తం చేశారు. కొద్ది రోజుల క్రితం చిత్తూరు జిల్లా వెదురుకుప్పంలో అంబేడ్కర్ విగ్రహానికి నిప్పు పెట్టటం, ఇప్పుడేమో సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తిపై కాలి బూటును విసరటం చూస్తే తేదేశానికే సిగ్గుచేటని ప్రజాసంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేసి తమ నిరసనలు తెలిపారు. వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ పాటిబండ్ల గంగయ్య, ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు తొరటి ఆనంద్, పిన్నిక శ్రీనివాసరావు, బుట్టి సాల్మన్, తొట్టెంపూడి రామారావు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



చీమకుర్తిలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

**ఒంగోలు టౌన్:** సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయ్ మీద చెప్పును విసరడాన్ని క్షమించకూడదని.. ఈ ఘటనను ఉగ్రదాడిగా పేర్కొంటూ కేసు నమోదు చేయాలని సోషల్ డెమొక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు షేక్ సత్తార్ మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. సహనం, సంయమనంతో కోర్టు గౌరవాన్ని ఒక న్యాయవాదే స్వయంగా దుందుడుకు చర్యలకు పాల్పడడం బాధాకరమన్నారు. బాధితులకు అండగా ఎన్నో విలక్షణమైన తీర్పులు ఇస్తూ న్యాయవ్యవస్థపై నమ్మకాన్ని పెంచుతున్న సుప్రీం కోర్టు సీజే మీద దాడిని ప్రభుత్వం కంటితుడుపు ఖండనలతో సరిపుచ్చుండా కఠినంగా శిక్షించాలని కోరారు. మతపరమైన మూఢనమ్మకాలతో సుప్రీం కోర్టు విలువైన సమయాన్ని వృథా చేయడం తగదని హితవు పలికారు.





నిరసన తెలుపుతున్న వ్యవసాయ కార్మిక సంఘు నాయకులు

**జస్టిస్ గవాయ్ మీద దాడి రాజ్యం మీద దాడే**

**ఒంగోలు టౌన్:** సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ గవాయ్ మీద చెప్పు విసరడం రాజ్యాంగం మీద దాడి చేయడమేనని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు చెప్పారు. జస్టిస్ గవాయ్ మీద దాడిని ఖండిస్తూ మంగళవారం ఆర్టీసీ డిపో సెంటర్లో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి బి. రఘురామ్ మాట్లాడుతూ... బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత రాజ్యాంగం మీద, రాజ్యాంగ వ్యవస్థల మీద దాడులు నిత్యకృత్యం అయ్యాయని, దళితులు, మైనార్టీల మీద మూక దాడులకు పాల్పడుతున్నారని చెప్పారు. నిరసన కార్యక్రమంలో ఐద్వా నాయకురాలు రమాదేవి, ఆదిలక్ష్మి, మాలతీ, రాజ్యలక్ష్మి, కొండారెడ్డి, చీకటి శ్రీనివాసరావు, మోజెస్, బండి స్వామి, బాబు, బాలకోటయ్య పాల్గొన్నారు.

# ఆశా కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలి



పీర్లమాన్యంలో డాక్టర్‌కు అర్జీ ఇస్తున్న ఆశా కార్యకర్తలు

**సంతనూతలపాడు:** ఆశా వర్కర్ల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలమైందని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బంకా సుబ్బారావు పేర్కొన్నారు. మంగళవారం యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సంతనూతలపాడు పీహెచ్‌సీ, పేర్నమిట్ట పేర్నమిట్ట పరిధిలోని పీర్లమాన్యం యూపీహెచ్‌సీలలో పనిచేస్తున్న సిబ్బంది అర్జీలు అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెరిగిన ధరలకు అనుగుణంగా ఆశా వర్కర్లకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆశాలకు దహన సంస్కారాలకు రూ.20 వేలు ఇవ్వాలన్నారు. సమావేశాలకు వెళ్లినప్పుడు టీఏ, డీఏ ఇవ్వాలని, కొత్త మొబైల్ ఫోన్లు ఇవ్వాలని, ఉద్యోగులకు ఇచ్చినట్లుగానే అన్ని రకాల సెలవులను ఇవ్వాలని వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు డీ మాధవి, పిచ్చమ్మ, సుజాత తదితరులు పాల్గొన్నారు.

# అండర్-19 జిల్లా హాకీ జట్టు ఎంపిక



జిల్లా హాకీ జట్టుకు ఎంపికైన క్రీడాకారులు

**సంతనూతలపాడు:** మండలంలోని మైనంపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అండర్-19 బాలబాలికల జిల్లా హాకీ జట్టు ఎంపిక చేసినట్లు నిర్వాహకులు రవికుమార్, శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. అడర్-19 ఎస్‌జీఎఫ్ సెక్రటరీ చింపారెడ్డి మాట్లాడుతూ ఎంపికైన క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో హెడ్‌మాస్టర్ నరశింహరావు, డైట్ కాలేజి అధ్యాపకులు, సెక్రటరీ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# జీఎస్టీ సూపర్ సేవింగ్‌పై అవగాహన

**నాగులుప్పలపాడు:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకువచ్చిన సూపర్ జీఎస్టీ 2.0తో పేద, మధ్యతరగతి ప్రజలకు లాభం చేకూరుతుందని ఎంపీడీవో తేళ్ల రవికుమార్ అన్నారు. సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ అవగాహన కార్యక్రమాల్లో భాగంగా మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఉన్నత పాఠశాలలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. అభివృద్ధి వేగవంతమై 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశం ఆవిష్కృతమవుతుందన్నారు. మండల పరిధిలోని అన్నీ ఉన్నత పాఠశాలలలో విద్యార్థులకు వ్యాస రచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహించి ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవోలు తిరుమలశెట్టి రవి, రమణయ్య, జీఎస్టీ డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ తలపల ఏడుకొండలు పాల్గొన్నారు.



విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

# మానవాళి శ్రేయస్సుకే అంతరిక్ష ప్రయోగాలు

**ఒంగోలు సిటీ:** మానవాళి శ్రేయస్సుకే అంతరిక్ష ప్రయోగాలు అని సతీశ్ ధావన్ స్పేస్ సెంటర్ (షార్) డిప్యూటీ డైరెక్టర్ గోపీకృష్ణ పేర్కొన్నారు. షార్, ఇస్రో, ఒంగోలు క్విస్ విద్యాసంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఒంగోలులో అంతరిక్ష వారోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. అంతరిక్ష వారోత్సవాల్లో భాగంగా మొదటి రోజు మంగళవారం అంతరిక్ష నడక (స్పేస్ వాక్)ను నిర్వహించారు. ఈసందర్భంగా గోపీకృష్ణ మాట్లాడుతూ.. విద్యార్థులతో పాటు సామాన్య ప్రజానికానికి అంతరిక్షం, అంతరిక్ష పరిశోధనలు, వాటి వల్ల మనకు కలిగే ప్రయోజనాల గురించి తెలియజేయాలనే ఉద్దేశంతో స్పేస్ వాక్ నిర్వహించినట్లు చెప్పారు. ముఖ్యంగా విద్యార్థులకు రాకెట్ పనితీరు తదితర అంశాలపై అవగాహన కల్పించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయన్నారు. క్విస్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ నిడమానూరి సూర్య కల్యాణ్ చక్రవర్తి, ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ డాక్టర్ నిడమానూరి శ్రీగాయత్రి దేవి మాట్లాడుతూ.. ఇలాంటి గొప్ప కార్యక్రమానికి క్విస్ మా కళాశాల వేదిక అవ్వడం గర్వకారణంగా ఉందన్నారు. ఒంగోలులోని ఎస్పీ ఆఫీస్ నుంచి అద్దంకి బస్టాండ్ వరకు స్పేస్‌వాక్ ర్యాలీ సాగింది. ఒంగోలు డీఎస్పీ శ్రీనివాసరావు, ముఖ్య అతిథులు జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ర్యాలీలో క్విస్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వైవీ హనుమంతరావు, డీఏఎస్ ఆర్ డైరెక్టర్ డాక్టర్ సుబ్బారావు, సీఎస్ సీడీఈ డీన్ డాక్టర్ భార్గవ్, వరల్డ్ స్పేస్ వీక్-2025 ఒంగోల్ సబ్ కమిటీ చైర్మన్ లీలా నాగ శ్రీనివాసరావు, మెంబర్ సెక్రటరీ ఆదిత్యఎన్ ఎస్ఎస్, ఎన్‌సీసీ విభాగాధిపతులు, వలంటీర్లు పాల్గొన్నారు.



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న షార్ డిప్యూటీ డైరెక్టర్ గోపీకృష్ణ

# స్థల వివాదంలో ప్రజాభిప్రాయ సేకరణ

**కొత్తపట్నం:** రెండు గ్రామాలకు సంబంధించిన స్థల వివాదంలో అధికారులు ప్రజాభిప్రాయ సేకరణ చేశారు. మండలంలో ఉన్న వజ్జిరెడ్డిపాలెం గ్రామంలో అధికారుల సమక్షంలో మంగళవారం గ్రామ సభ నిర్వహించారు. కార్యక్రమానికి తహసీల్దార్ శాంతి, ఎంపీడీవో శ్రీకృష్ణ, ఈవోఆర్డీ వేణు మూర్తి, డిప్యూటీ తహసీల్దార్ రామానాయుడు హాజరై ప్రజాభిప్రాయ సేకరణ చేశారు. వివరాల్లో వెళ్తే.. వజ్జిరెడ్డిపాలెం, గమళ్లపాలెం గ్రామాలకు చెందిన సర్వే నంబర్ 1604లో 1.43 ఎకరాల స్థలం వజ్జిరెడ్డిపాలెం గ్రామస్తులకు, రజకులకు మధ్య వివాదం నడుస్తోంది. వజ్జిరెడ్డిపాలెం గ్రామస్తులు కలిసి పిండాల దిబ్బని అంటున్నారు. రజకులు మాత్రం అది చాకలి దిబ్బని అంటున్నారు. ఇరువర్గాలు కలెక్టర్ కార్యాలయంలో గ్రీవెన్స్‌లో అర్జీలు ఇస్తూ వచ్చారు. అయితే సమస్య పరిష్కారం కాకపోవడంతో రజకులు హైకోర్టుకు వెళ్లారు. దీనిని పరిష్కరించాలని కలెక్టర్ ప్రజాభిప్రాయ సేకరణ, గ్రామ సభ నిర్వహించాలని తహసీల్దార్ శాంతికు ఉత్తర్వులు ఇచ్చారు. వజ్జిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన ప్రజలు సర్వే నెంబర్ 1604లో ఉన్న 1.43 సెంట్ల భూమిను పిండాల దిబ్బగా ఉండాలని ఒక్కొక్కరుగా తమ అభిప్రాయాన్ని తెలిపారు. గ్రామ సభలో రజక సంఘ పెద్ద మంత్రి వెంకయ్య మాట్లాడుతూ.. 1970లో సర్వే నంబర్ 1604 సబ్‌డివిజన్ 51లో 1.43 ఎకరాల స్థలం ఇచ్చారని అప్పటి నుంచి సానలలో ఉన్న నీటిలో దుస్తులు ఉతుకుంటూ జీవనం గడిపేవారమన్నారు. రానురాను సానలు ఎండిపోయిన తరువాత 1988లో అప్పటి సర్పంచ్ బలగాని చంద్రమౌళి ఈ సర్వే నంబర్‌లో తొట్లు, బావి, మోటర్, బోరు, విద్యుత్ సర్వీసు నిర్మించారని, ఇప్పటికీ అవి ఉన్నాయని వివరించారు.



గ్రామ సభలో మాట్లాడుతున్న తహసీల్దార్ శాంతి

**లెక్టర్ దృష్టికి తీసుకువెళ్తాం..**

తహసీల్దార్ శాంతి మాట్లాడుతూ ప్రజాభిప్రాయ సేకరణ, గ్రామ సభలో జరిగే ప్రతి ఒక్కరూ మాట్లాడే విషయాలన్నీ నమోదు చేసి ఇరువర్గాల అభిప్రాయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసికెళ్తామన్నారు. కలెక్టర్ ఏ నిర్ణయం తీసుకుంటే అదే అమోదించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీకృష్ణ, సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

# వైభవంగా గిరి ప్రదక్షిణ ప్రత్యేక పూజలు

**త్రిపురాంతకం:** పార్వతి సమేత త్రిపురాంతకేశ్వర స్వామి ఆలయం వద్ద పౌర్ణమి సందర్భంగా కుమార గిరి ప్రదక్షిణ కార్యక్రమాన్ని భక్తజనులు వేదపండితుల మంత్రోచ్ఛరణలతో వైభవంగా నిర్వహించారు. త్రిపురాంతకంలోని త్రిపురాంతకేశ్వరస్వామి ఆలయ గిరి ప్రదక్షిణ కార్యక్రమాన్ని ప్రతి పౌర్ణమికి భారీగా తరలి వచ్చి భక్తులు నిర్వహిస్తున్నారు. ఈగిరి ప్రదక్షిణలో ఇతర ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో వస్తున్న భక్తులు పాల్గొని తరిస్తున్నారు. ప్రదక్షిణ అనంతరం స్వామి అమ్మవార్లకు అభిషేకంలు, కుంకుమార్చన ప్రత్యేక పూజలను ఆలయ అర్చకుడు విశ్వనారాయణ శాస్త్రి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. అనంతరం భక్తులకు ప్రసాదాలు అందజేశారు.



త్రిపురాంతకం కుమారగిరి ప్రదక్షిణలో భక్తులు

# విలువలతో కూడిన విద్యతో ఉన్నత జీవితం

**ఒంగోలు టౌన్:** బాల్యం నుంచే విలువలతో కూడిన విద్య, క్రమశిక్షణ వలన జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ న్యాయమూర్తి షేక్ ఇబ్రహీం షరీఫ్ చెప్పారు. మంగళవారం నగరంలోని బాల సదన్ ,శిశు గృహను సందర్శించిన ఆయన అక్కడ విద్యార్థులకు అందుతున్న భోజన సదుపాయాలను పరిశీలించారు. కార్యాలయ నిర్వాహణను పరిశీలించిన ఆయన మరింత మెరుగైన సదుపాయాలు, వసతుల కోసం సూచనలు చేశారు. చట్టపరంగా విద్యార్థులకు అందించాల్సిన న్యాయసహాయాన్ని జిల్లా న్యాయసేవాధికార సంస్థ అందిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో స్త్రీ శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరక్టర్ ఎస్.సువర్ణ, చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి దినేష్ కుమార్,లీగల్ సెల్ ఆఫీసర్ రత్న ప్రసాద్ పాల్గొన్నారు. న్యాయవాదులను నియమించుకోలేని ఖైదీలకు లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టమ్ ద్వారా ఉచితంగా న్యాయ సహాయం అందజేస్తారని, ప్రతి ఒక్క ఖైది ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని షేక్ ఇబ్రహీం షరీఫ్ చెప్పారు. జిల్లా జైలును సందర్శించి న్యాయ విజ్ఞాన సదసులో మాట్లాడారు. కార్యక్రమంలో డిప్యూటీ జైలర్ ఎలమందరావు, డిప్యూటీ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ పి.వీరరాఘవులు, జైలు సిబ్బంది పాల్గొన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి షేక్ ఇబ్రహీం షరీఫ్

### మహర్షి వాల్మీకిని ఆదర్శంగా తీసుకోవాలి



వాల్మీకి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఏఆర్ పోలీసులు

**ఒంగోలు టౌన్:** రామాయణ మహాగ్రంథాన్ని రచించిన ఆదికవి మహర్షి వాల్మీకిని ఆదర్శంగా తీసుకోవాలని ఎస్పీ వీ హర్షవర్ధన్ కోరారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలోని ఏఆర్ ఆఫీసు వద్ద వాల్మీకి జయంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆర్‌ఐలు సురేష్, రమణారెడ్డి, సీతారామిరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పోలీసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్రతి ఒక్కరూ రామాయణాన్ని చదివి అర్థం చేసుకోవాలని, రామాయణం స్ఫూర్తితో జీవితం విలువలను పెంపొందించుకోవాలని చెప్పారు.

### మధ్యాహ్న భోజనం నాణ్యంగా ఉండాలి

**పుల్లలచెరువు:** విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం నాణ్యంగా ఉండాలని ఎంఈవో ఇందిర అన్నారు. మంగళవారం మండలంలోని ముటుకుల పాఠశాలలో మధ్యాహ్న భోజనం తయారీని ఆమె పరిశీలించారు. అనంతరం ఎంఈవో మాట్లాడుతూ విద్యార్థులకు వడ్డించే భోజనం పరిశుభ్ర ప్రదేశంలో ఈగలు, దోమలు లేకుండా చూసుకుని రుచికరంగా తయారు చేయాలన్నారు. ప్రభుత్వం సూచించిన మెనూను తప్పక పాటించాలని చెప్పారు. రోజూ ఉపాధ్యాయులు తనిఖీ చేసిన తర్వాతే విద్యార్థులకు వడ్డించాలని సూచించారు. విద్యార్థుల నుంచి ఫిర్యాదులు వస్తే నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.